


# 30

# ఆమె నలభై ఐదవ పుట్టినరోజు

సుందరం ఆరుగంటలకే ఆఫీసుకు బయలు దేరాడు. చాలా యేళ్ళనాటి మోటారు సైకిలు. అది అతని ట్రేడ్‌మార్కు వాహనం. వాళ్ల వీధిలో చాలా పూల కొట్లు ఉన్నాయి. వాళ్లు కొట్లు తెరుస్తున్న సమయం అది. పూలకొట్ల దగ్గర కాసేపు ఆగాడు. బంతిపూల హారాలు, చేమంతులు ఎవరూ కొననట్లుగా రోజుల తరబడీ అలాగే పడి ఉన్నట్లుగా వాడిపోయి, పరిమళాన్ని కోల్పోయినట్లుగా. ఐదు రూపాయలు ఇచ్చి, కాసేపయి నాక సన్నజాజుల దండ ఇంట్లో ఇవ్వమని చెప్పాడు.

చీకటి ఇంకా వెళ్లిపోని, పూర్ణ ఇంకా నిద్రలేవని ఉదయం ఓ చిన్న టిఫిన్ బాక్స్‌లో రాత్రి చేసిన చపాతీలను కుక్కుకొని బయ ల్దేరాడు. నల్లటి ఉదయాలు, అసలివి ఉదయాలేనా అని సుందరం అనుమానం. రాత్రుల నిరంతర కొనసాగింపులే అనుకున్నాడు.

సుందరం వెళ్లిపోయే సమయానికి పూర్ణ పడుకునే ఉంది. అది పడుకోవడమే. నిద్రకాదు. ఉదయం ఎనిమిది దాకా అట్లాగే పడుకొని ఉంటుంది, సిగ్నల్స్ అందని ఎలక్ట్రానిక్ పరికరంలా. రాత్రి వేసుకున్న మాత్రల ప్రభావం కొనసాగుతూనే ఉంటుంది. బి.పి. కోసం, శరీరం నుంచి వెలికి వచ్చే అగ్నిశ్వాసల కోసం, నిరంతరం

రక్తం స్రవించే గర్భాశయం కోసం, దాదాపు ఎనిమిది మాత్రలు. టి.వి. అడ్వర్ టైజ్‌మెంటు లోని ఆడమనిషిలా చకచకా లేచి, చిటికెలో ఇంటిని సర్ది, ఘుమఘుమలాడే బ్రేక్‌ఫాస్ట్ చేసి, ఊహూ... శరీరం సహకరించదు. ఆమె ఉదయం, దృశ్యాలు దృశ్యాలుగా వుంటుంది. దృశ్యాలన్నిటిని పక్కపక్కనే పెట్టుకుని, ఫీనిక్స్ బర్డ్‌లా ఆ దృశ్యాల్లోంచి పైకిలేచి, అప్పటికి తొమ్మిది అవుతుంది.

సుందరం వెళ్లిపోయి చాలాసేపయినట్లుగా అర్థం అయింది. రాత్రి నిద్రపోవ డానికి ముందు దృశ్యం గుర్తుకొచ్చింది. కొద్దిగా బీరువాసన వేస్తూ, తన పక్కనే పడుకొని, సీలింగ్ వైపు చూస్తూ, ఎప్పటిదో పాత సినిమాపాటను గొణుగుతూ, "పోతే పోనీలేరా.." పాట వినిపిస్తూనే ఉంటుంది. పూర్ణ కళ్లు మూసుకొని, చాలా యేళ్లనాటి సంఘటనలను గుర్తు చేసుకుంటుండగా, సుందరం, అగ్నిని శ్వాసించే యంత్రంలా ఆమెను చుట్టు ముట్టాడు. శరీరమంతా పక్షులు రెపరెపలాడినట్లనిపించి, "రేపు నీ పుట్టినరోజు," అని గుర్తుచేశాడు.

రాత్రి చాలాసేపటి వరకు మేలుకొనే ఉంది పూర్ణ. కళ్లు మూసుకొని ఉన్న పూర్ణను చూసి నిద్రలోకి వెళ్లిపోయిందనుకున్నాడు సుందరం. అతని గురక వినిపిస్తుంది పూర్ణకు. పూర్ణ నిద్రకు, మెలకువకూ మధ్యన తచ్చాడుతూ, కాస్త కునుకు పట్టగానే కల ఒకటి.. జీవితపు ముగింపు గురించినది, ఎదురయింది. ఉలిక్కిపడి లేచింది. మళ్లీ నిద్రలో ఎక్కడెక్కడికో ప్రయాణించింది. సమూహాల మధ్య, చేలలో పైరుకోస్తున్న స్త్రీలు, మార్కెట్‌లో వరుసగా కూర్చొని కూరగాయలు అమ్మే ఆడవాళ్ళు, తారుడబ్బాలతో రోడ్లు వేస్తున్న స్త్రీలు. వాళ్లల్లో ఒకతైపోయింది పూర్ణ. కల కొనసాగుతుండగా, మధ్యలో దృశ్యం మారి, సామూహికంగా మరణించిన ఆడవాళ్ల దృశ్యం కలలోకి వచ్చింది. పేవ్ మెంట్‌పై వరుసగా పడుకోబెట్టిన శవాలు, రోడ్డుపై ఆ శవాల్లో తానూ ఉన్నట్లుగా.

కాసేపటికి, ఇల్లు కలలోకి వచ్చింది. ఇంటి కోసం వెతుకుతూ ఉంది. ఎన్నెన్నో మలుపులు, రోడ్లు తిరిగినాక, ఇల్లు వచ్చింది. తలుపు తట్టగా తట్టగా చాలాసేపటికి తెరచుకుంటుంది. తెరిచిన ఇంట్లో పొగలు పొగలుగా చీకటి. ఇంటి మధ్యకు చేరగానే, ఫ్యాన్‌కు వేలాడుతున్న శవం కనిపించింది. దగ్గరగా వెళ్లి చూస్తే అది ఆమె శవమే.

పోయిన సంవత్సరం, వీపుపైన నల్లటి, లావాటి 'మోల్'ను చూసి, గంభీరమైన ముఖాన్ని పెట్టి, డాక్టర్, ఇరవై టెస్ట్‌లు రాసి, ముక్క కోసి, పరీక్ష చేసి, ప్రీ కాన్సర్ అని నిర్ధారణ చేసి, ప్రస్తుతానికి భయం లేదంటూ. కోసిన ముక్కను చూసింది, "చావు ఇలాగే మొదలవుతుందా?" అని డాక్టర్‌ను అడిగింది.

ఇవాళ పూర్ణ పుట్టినరోజు.

వారి పెళ్లయి ఇరవై రెండు ఏళ్లయింది. కొత్తలో బ్యూటీ పార్లర్ నడిపేది పూర్ణ. ముందుగది అద్భుతంలా ఉండేది. లావెండర్ రంగు పెయింట్ వేసిన గోడలు, ప్లాస్టిక్ పూలు, లతలు గోడలపై నుంచి జారుతూ, ఆ గది ఇప్పటికీ అట్లాగే ఉంది. అదృశ్యం కాని కలలా. ఆ గదినిండా పూర్ణకిష్టమైన పుస్తకాలు, ముఖ్యంగా సులోచనారాణి నవలలు, ఆమె కిష్టమైన ఘంటసాల పాటలు, క్యాసెట్లలో, కాలేజీరోజుల్లో పూర్ణ వేసిన నాలుగైదు పెయింటింగ్‌లు ఇంకా గోడలపై వేలాడుతున్నాయి. ఈమధ్యకాలంలో భీకరమైన జాగిలం బొమ్మను ఫుట్‌పాత్‌పై కొనుక్కొచ్చి గోడపై అమర్చింది. ఆ బొమ్మ ముఖంలోని ఉగ్రరూపాన్ని చూసి సుందరం ఉలిక్కిపడ్డాడు. "నా కలల్లో కనబడే భీకరమైన జంతువులు రోడ్డుపైన బొమ్మలుగా అమ్ముతుంటే కొన్నాను' అంటూ సర్ది చెప్పింది పూర్ణ.

పూర్ణ నలభై నాలుగో పుట్టినరోజును గొప్పగా సెలబ్రేట్ చేసుకున్నారు వాళ్లు. ఇంటి ముందు ఆకుపచ్చ తోరణాలు కట్టి, లోపలి గోడలకు పూలదండలు కట్టి, ఐదువందలు పెట్టి పూలబొకేను తెచ్చాడు సుందరం. జీవితాన్ని వెనక్కి జరిపి, కొత్తగా ఫ్రెష్‌గా ఉండాలని కోరుకున్నాడు సుందరం. కొత్త చీర కట్టుకుంది పూర్ణ. బెంగుళూరులో ఉన్న కూతురితో పొద్దున్నే ఫోన్‌లో మాట్లాడింది. అంతకుముందు రోజు, నర్సరీకి వెళ్లి నాలుగు 'బోన్సాయ్' మొక్కలను కొనుక్కు వచ్చింది. అన్నీ మర్రివే. వాటి మధ్యలో కూర్చుని ఫొటోలు తీయించుకుంది. వచ్చే బర్త్‌డేనాటికి ముందు గదిలో ఫ్లోరింగ్ అంతా పీకేసి సింథటిక్ గ్రాస్‌ను పరవాలని నిర్ణయించుకుంది. మధ్యలో మినీ ఫౌంటేన్ కూడా.

ఆ రాత్రి బెడ్‌రూంలో కిటికీ పక్కన కూర్చుంది పూర్ణ. ఆకాశంలో ఒక మబ్బు తునక. ఒంటరి నక్షత్రం మసకమసగ్గా మెరుస్తూ. సుందరం ఆమెను చేతుల మధ్య పొదువుకొని, రొమాంటిక్‌గా, బ్లాక్ అండ్ వైట్ సినిమాల్లో హీరోలా ఉన్నాడు. "ఇవాళ నువ్వు నా ఎఎన్నార్‌వి," అంది మురిపెంగా. పెళ్లయిన కొత్తలో అతన్ని రాజశేఖరం అని పిలిచేది. (సులోచనారాణి నవల్లో హీరో) "ఇవాళ నీలో నాకిష్టమైన వాళ్లందరూ కనిపిస్తున్నారు," అంది అరమోడ్పు కళ్లతో. 'నువ్వు నా మైఖేల్‌జాక్సన్‌వి. నా రాజ్‌కుమార్‌వి, నా ప్రేమనగర్ నాగేశ్వరావువి. 'కభీకభీ మెరెదిల్‌మే' పాటవి,' అంది తన్మయంగా.

ఆ రాత్రే పూర్ణకు తన కుడి స్తనంపై దట్టమైన ఆకుపచ్చటి గడ్డి మొలిచినట్లుగా కల వచ్చింది. కల మధ్యలోనే, ఆ మరుసటి రోజు హాస్పిటల్‌లో అపాయింట్‌మెంట్ ఉన్నట్లు గుర్తుకొచ్చింది. స్కానింగ్ చేయించాల్సి ఉంది.

పూర్ణకు తన ముప్పయ్యోవ పుట్టినరోజు గుర్తుకు వచ్చింది. ఆరోజు సుందరం పొద్దున్నే వెళ్లిపోయాడు. టేబుల్‌పై చిన్న బర్త్‌డే గ్రీటింగ్. పుట్టినరోజున అలా కనబడ కుండా, మాట్లాడకుండా వెళ్లినందుకు పూర్ణ దిగులుపడింది. వందలాది వేలాది ఉదయాలు. ఇదీ ఒకటి అనుకుంది. ఖాళీగా ఉంది ఉదయం. ఇల్లు కూడా ఖాళీగా

ఉంది. ఏడేళ్లెట్లా గడిచిపోయాయో తెలియలేదు. సుందరంలో ఎన్నో మార్పులు వచ్చాయి. దూదిలా, మృదువుగా తెల్లగా మెరిసే సుందరం శరీరం రాతిగోడలా బిగుసుకు పోయింది. (వడలిపోయి, పెట్లిపోయి) అతని చేతుల్లో ఒదిగి, అతను మృదువుగా నిమురుతుంటే ఎంతో ఇష్టంగా ఉండేది. ఇప్పుడా చేతులు పదునైన కత్తుల్లా శరీరాన్ని బాధ పెడుతున్నట్లు. ఆ రాత్రి సుందరం ఇంటికి చేరేసరికి పదయ్యింది. బాగా అలసిపోయి ఉన్నాడు. స్నానంచేసి, పూర్ణ వండిన స్పెషల్స్ అన్నీ తిని, అన్నం వడ్డిస్తున్నప్పుడు, 'మహా సౌందర్యమూర్తిలా ఉన్నావని' పొగిడాడు. కొంచెం బీరు తాగుతానన్నాడు. (వస్తూ వెంట తెచ్చుకున్నాడు.) చాలాసేపటి తరువాత, ఏదైనా హోటల్‌కు వెళ్దాం అన్నాడు. పూర్ణకు అర్థంకాలేదు. "నువ్వు నా భార్యవు కాదు. నా ప్రియురాలివి. మనం ఇవాళే మొదటిసారి కలుస్తున్నాం," అన్నాడు. పూర్ణ సిగ్గుపడింది. రెండు బాటిళ్ళ బీరు తాగాక, "బట్టలన్నీ విప్పు," అన్నాడు. ఆమెకు కంగారు. సిగ్గుపడుతూనే- "లైట్ వెయ్యి," అన్నాడు. "నైస్‌గా ఉండు. నీకు వంద రూపాయలు టిప్ ఇస్తాను," అన్నాడు. ఈడ్చి కొట్టినట్లుగా, భయంగా అలాగే చూస్తూ, చీరను చుట్టుకొని అక్కడి నుంచి పారిపోవాలనుకుంది పూర్ణ. సుందరం పెద్దపులిలా మారిపోయాడు. పూర్ణ శరీరం నిండా పెద్ద గాయాలు. పెద్దగా ఏడ్వాలని, కోపంగా ఎవరినైనా తిట్టాలనిపించింది ఆమెకు. ఓపికలేక అట్లాగే పడుకొంది.

పూర్ణ తన ఇరవై ఆరవ పుట్టినరోజును అత్తగారింట్లో జరుపుకుంది. అత్తగారు ఉదయాన్నే తలంటి, కొత్త చీరను ప్రెజెంట్ చేసి, ఆమె కోసమని పాయసాన్ని, గారెల్ని చేసింది. సుందరం అన్న సత్యప్రకాశం పూర్ణకు గోర్కీ 'అమ్మ' పుస్తకాన్ని ప్రజెంట్ చేశాడు. ఆరోజు ఆమెను అత్తగారు పక్కనే కూర్చోబెట్టుకొని ఎన్నో కబుర్లు చెప్పింది. సత్యప్రకాశం కమ్యూనిస్టు రాజకీయాల్లో (తీవ్రవాద) ఉండేవాడు. ఎంతోమంది కార్యకర్తలు, స్నేహితులు వాళ్లందరికీ వండి వారుస్తుండేదాన్నని చెప్పింది. ఆ రోజుల్ని తలచుకొని, ఆవిడ ఉద్వేగభరిత మయ్యేది. సి.పి. అనే ఒకానొక అగ్రనేత వాళ్ల ఇంటికి వచ్చిన సందర్భాన్ని ఆమె మెరిసే కళ్ళతో గుర్తు చేసుకుంది. అందరూ ఆమెను 'అమ్మ' అని గౌరవించేవారు. 'నువ్వు గోర్కీ అమ్మకు ఏ మాత్రం తీసిపోవు' అని సి.పి. కితాబు ఇచ్చాడని చెప్పింది పూర్ణ అత్తగారు. సుందరం పెళ్లయ్యేనాటికి ఆ రోజులన్నీ అదృశ్యమయ్యాయి. సత్యప్రకాశం ఉద్యమంలోంచి బయటికి వచ్చి హోర్డింగ్‌లు, బ్యానర్లు పెయింట్ చేసే ఉద్యోగంలో చేరాడు. ఆరోజుల్లో పూర్ణ కలల్లో అతను కనబడేవాడు. రెండు పాడవాటి కత్తులతో వీర విహారం చేస్తున్నట్లు, అడవులలో, ఆదివాసీల మధ్యన ఉపన్యాసాలు చేస్తూ, పాటలు పాడుతూ కనబడేవాడు. ఒకసారి, అతను పూర్ణను గట్టిగా కౌగిలించుకొని, ముద్దు పెట్టుకున్నట్లు కల వచ్చింది. ఆ కల తరువాత చాలారోజులపాటు పూర్ణ గిల్టీగా ఫీల య్యింది. కొన్ని సంవత్సరాల తరువాత సత్యప్రకాశం వాళ్లింటికొచ్చాడు. మాసిపోయిన

చొక్కా, గుబురు గడ్డం, దువ్వని తల, పూర్ణ కలల్లో, మహావీరుడిలా మెరిసిన వ్యక్తి కాదు. అయినా అతను వాళ్లింట్లో ఉన్న రెండు రోజులు అతనికి ఎదురుగా వెళ్లాలంటే సిగ్గుపడేది పూర్ణ.

ఇరవై నాలుగో పుట్టిన రోజున, వేకువజామునే లేచింది పూర్ణ. ఉదయపు వెలుగు ధవళవస్త్రంలా ఆమె శరీరాన్ని కప్పుతున్నట్లుగా, పైనెక్కడో చల్లని మేఘం చిట్లి, చినుకుగా మారుతుంది. అప్పుడు పూర్ణకు తొమ్మిదో నెల. ఇంటిపై టపటపమంటూ వాన చినుకులు. ఇంటికప్పును తెరచుకొని, అవి చుట్టుముట్టినట్లుగా, వాన చినుకు స్పర్శకు ఉలిక్కి పడుతుంది.

ఉదయపు వాసన.

ఒక కప్పు కాఫీ.

రాత్రి నిద్ర పొడవునా శిశువు గురించి కలలే! మెలకువలోనూ కలల స్పర్శే! తల్లుల గురించి గుర్తు చేసుకుంది పూర్ణ. తన తల్లి, ఆమె తల్లి, ఇంకా పురాతన స్మృతుల లోని తల్లులందరిని గుర్తు చేసుకుంది. వాళ్లందరి ఆత్మలు తనలో, తన శిశువులో పెరుగుతున్నట్లు...

హైదరాబాద్‌నగరంలో

ఒకానొక చిన్న గది...

ఒక పూర్ణ మాణిక్యం.

ఎవరికో కూతురు, పక్కకున్న మనిషికి సహచరి. పూర్ణకు అంతా అద్భుతంలా ఉంది. తనలో మార్మిక ప్రక్రియ ఏదో జరుగుతున్నట్లు అనిపిస్తుంది. సన్నటి చినుకుల పాట, ఉదయం, తూర్పున సన్నటి వెలుగు, కొవ్వొత్తులు వెలిగించినట్లు, ఉదయం నుంచి మధురమైన వాసనేదో... అన్ని వైపుల నుంచి అడుగుల చప్పుడు.

చిన్ని పాదాల అడుగుల చప్పుడు.

పూర్ణ ఫ్రిజ్ తెరిచింది.

ఫ్రిజ్‌లో కూరగాయలు, పండ్లు, గుడ్లు, బేకర్ ఫ్రెష్ కేక్- తెరిచిన ఫ్రిజ్‌లోంచి కోడిగ్రుడ్లు కిందికి దొర్లి, ఆశ్చర్యంగా నేలపై పగలని గుడ్లు. విచ్చుకోవడానికి సిద్ధంగా ఉన్న కలలా, కిటికీపై ప్రసరిస్తున్న సన్నని వెలుగు, రివ్వురివ్వుమంటున్న పక్షులు, పూర్ణకు తన శరీరమొక విశాలమైన నదిలా మారినట్లు, ఆమె బాహువుల మధ్యన ఎవరో ఈదు తున్నట్లు, ఎవరో అజ్ఞాత పురుషుడు భగవంతుడి లాంటి, శిశువులాంటి ఎవరో, పూర్ణకు తన శరీరమంతా తల్లి వాసన వేసింది. బయట వరండాల్లో వెలుతురుకు వేలాడుతూ ఒక జోలపాట. సరిగ్గా అప్పుడే, సుందరం, ఆమె చెవి దగ్గర హ్యాపీ బర్త్‌డే అంటూ గుసగుస లాడాడు.

పెళ్లయిన నెలలోనే ఆమె ఇరవైమూడవ పుట్టినరోజు వచ్చింది. ఆ రోజు

మధ్యాహ్నం మూడింటికి నిద్రలేచింది. సుందరం పదకొండు గంటలకు లేచాడు. పూర్ణను నిద్రలేపాలనిపించలేదు. ఆమె నిద్రపోయేటప్పుడు చూడడం సుందరానికి ఎంతో ఇష్టం. బెడ్‌నంతా ఆక్రమించుకొని, చేతుల్ని, కాళ్లని అన్నివైపులకు విసిరేసి, బెడ్‌పై ఆకుపచ్చని కలల్ని కంటున్న వనదేవతలా కనిపించింది. సుందరం మౌనంగా ఆమె పక్కనే కూర్చున్నాడు. ఆమె రాత్రి నిద్ర పోయేటప్పుడు చదువుతూ వదిలివేసిన నవల తీసుకొని, శ్రద్ధగా, స్కూలు విద్యార్థిలా, నవల మొత్తాన్ని చదివాడు. ఆ నవల పూర్తయ్యేసరికి మధ్యాహ్నం ఒంటిగంట అయింది. అప్పటికీ పూర్ణ నిద్ర లేవలేదు. గుర్తుకొచ్చిన పాత తెలుగు సినిమా పాటలన్నీ పెద్ద పెద్దగా పాడడం మొదలుపెట్టాడు. 'తేటతేట తెలుగులా తెల్లవారి వెలుగులా' అనే ఆత్రేయ పాట పాడుతున్నప్పుడు ఆమె నిద్రలేచింది. కలువలు విచ్చుకున్నట్లు. "ఆకలిగా ఉంది. తినడానికి పాటలేనా ఇంకేమయినా ఉందా?" అంది చిరునవ్వుతో. అతను నిస్సహాయంగా చూశాడు. పావుగంట తరువాత వాళ్లిద్దరూ, ఇంటి దగ్గరలోనే ఉన్న ఇరానీ రెస్టారెంట్‌లో తేలారు. ట్రాఫిక్ రణగొణధ్వనులు, ఎక్కడి నుంచో ఎగసి వస్తున్న వేణునాదం, సైనికుల కవాతు, ఏక్‌లా చలో అంటూ మిలిటరీ కమాండ్, కమ్మని బిరియానీ వాసనలు, రెస్టారెంట్‌లో వినిపించే పాత హిందీ సినిమా పాట, టీ ఘుమఘుమలు, ఎంతో అద్భుతంగా ఉందా మధ్యాహ్నం పూర్ణకు. సాయంకాలం ఐదుదాకా ఆ రెస్టారెంట్‌లోనే ఉన్నారు. రెస్టారెంట్ నుంచి బయటకి వచ్చి రోడ్డు అంచునే, పేవ్‌మెంట్‌పై నడుచుకుంటూ వెళ్లేవాళ్లు. పెరేడ్ గ్రౌండ్స్ చుట్టూ తిరిగి, ఒక మూలన జనం ఎక్కువలేని చోట కూర్చున్నారు వాళ్లు. చీకటిపడే దాకా కబుర్లు చెప్పుకున్నారు. సాయంకాలపు చలిగాలికి, పైట నిండుగా కప్పుకొని, అతనివైపే చూస్తూ క్రమంగా నిద్ర మత్తు ఆమెను కమ్మింది. అతని భుజంపై వాలిపోయి, అతను ఆమె స్పర్శను ఎంజాయ్ చేస్తూ ఆరోజు తన పుట్టినరోజు అన్న విషయాన్ని కూడా మర్చిపోయింది.

ఇవాళ ఏప్రిల్ 13, 2008, ఆమె నలభై ఐదవ పుట్టినరోజు.

*

పూర్ణకు పూర్తిగా మెలకువ వచ్చింది. కిటికీలోంచి జేగురు రంగు ఎండ పొడలు. లేచి స్లిప్పర్లు వేసుకొని, బాత్‌రూమ్ వైపుకు నడిచింది. ఆమె శరీరం పై లూజ్‌గా వేలాడుతున్న నైటీ. నైటీ లోపలి, ఆమె శరీరం వదలిపోయి, బిగుతు సడలినట్లపోయి, తనకు తానుగా కొత్తగా అనిపించసాగింది. అద్దం దగ్గర ఆగిపోయింది. అద్దంలో ఒక కొత్త మనిషి లావుగా, బరువుగా చెంపలపై నుదిటిపై తెల్లటి జుట్టు. ఎవరీమె? అద్దానికి దగ్గరగా నడిచింది. కళ్ళ కింద ముడతలు కనిపించాయి. ముఖం వడలిపోయి, గరుకుగా, మొరటుగా; పూర్ణ గాఢంగా నిట్టూర్చింది.

ఆకాశం, వెలుగు విత్తనాలు వెదజల్లుతున్నవేళ, పూర్ణ కిచెన్‌లోకి నడిచింది.

చిన్న గది. చాలా ఏళ్లుగా పరిచయమున్న నేస్తంలా, ఫ్రిజ్ తెరిచింది. గిన్నెలో చికెన్, శుభ్రం చేసి ముక్కలుగా చేయబడ్డ చేపలు, టమోటాలు, కొబ్బరి, అల్లం, గొప్ప విందు కోసం సిద్ధం చేయబడ్డ సరంజామా. పిల్లిపిల్ల ఒకటి గదుల మధ్య పరిచయమున్న స్నేహితునిలా తిరుగుతుంది. గిన్నెలో రాత్రి మిగిలిపోయిన అన్నాన్ని దాని ముందు పెట్టింది. గుప్పెడు గింజల్ని వరండా అంతా చల్లింది. గోడలపై కువకువ లాడుతున్న పావురాల కోసం. బయట బాక్స్‌లో ఉన్న పాల ప్యాకెట్ తెచ్చుకొని కాఫీ చేసుకుంది. కాఫీ తాలూకు వెచ్చని రుచి, నాలుకపై తగలగానే పూర్ణలో ఉత్సాహం మెల్లగా రాజుకుంది. మధ్యాహ్నం సుందరం వస్తానన్నాడు లంచ్‌కి.

ఉదయం 11 గంటలకే వంట పూర్తిచేసింది. తలస్నానం చేసింది. కురులు ఆరడానికన్నట్లు జుట్టునలా గాలికి వదిలేసి, కొత్తచీర, కొత్త హ్యాండ్ బ్యాగ్, కొద్దిగా బాడీ స్ప్రే, 'బర్త్ డే లేడీ'లా తయారయ్యింది. ఎక్కడికయినా వెళ్లాలనిపించింది పూర్ణకు. ఆటో ఎక్కి దగ్గరలో ఉన్న 'బసేరా' హోటల్‌కు వెళ్లింది. హోటల్ ఖాళీగా ఉంది. కౌంటర్‌లో ఒక అమ్మాయి కూర్చొని ఉంది. స్వీటు, కాఫీ ఆర్డరు చేసింది. కాఫీ తాగుతుండగా పూర్ణకు, సుందరానికో ఉత్తరం రాయాలని కోరిక కలిగింది. పదేళ్ల క్రితం దాకా వాళ్లు ఇష్టంగా ఉత్తరాలు రాసుకునేవాళ్లు. సుందరం రాసిన ఉత్తరాలు కొన్ని ఇంకా దాచింది. టేబుల్‌పై ఉన్న నేప్‌కిన్‌లు తీసుకొని దానిపై పూర్ణ సీరియస్‌గా ఉత్తరం రాయడం మొదలుపెట్టింది.

"నాకు అందంగా మాట్లాడటం రాదు. ఏది తోస్తే అది వాగేస్తాను. నువ్వేమో పద్ధతిగా కథల్లో మనుషుల్లా ఎమోషనల్‌గా మాట్లాడుకోవాలంటావు. నాకు ఇల్లు సర్దడం రాదు. పక్కనే రేడియో, టేప్, ఏ పాటనో లేకుండా ఏ పనీ చెయ్యలేను. థ్యాంక్యూ, సారీ, హౌ నైస్ లాంటి మర్యాదపూర్వక మాటలు నాకు వెంటనే గుర్తురావు.

"నీకు అన్నీ ఫర్‌ఫెక్టుగా ఉండాలి. ఇల్లు చిత్రకారుడి పెయింటింగ్‌లా ఉండాలి అంటావు. నున్నగా దువ్విన జుట్టు, మడత నలగని డ్రెస్, ఇంట్లో కూడా ఫ్రెష్‌గా, ఫొటోలోని మనిషిలా ఉంటావు నీవు. ప్రేమనో, జాలినో, దుఃఖాన్నో వ్యక్తం చేయడం నాకు రాదు. ఒంటరిగా ఒక్కక్షణం కూడా ఉండలేను. మనుషులు కనిపిస్తూ ఉండాలి నాకు. కనీసం వాళ్ల మాటలు, చప్పుళ్లు వినిపిస్తూ ఉండాలి. నువ్వేమో, ఇల్లంతా నిశ్శబ్దంగా ఉండాలంటావు. ఫాన్ కూడా చప్పుడు చేయకుండా వీచాలంటావు.

"నాకు చావు అనే భావన అంటేనే భయం. మనుషులు చనిపోతున్న దృశ్యాలను చూడడం నాకిష్టం ఉండదు. మీ అన్న సత్యప్రకాశం ఆత్మహత్య వార్త విని నేను వణికి పోయాను. ఫాన్‌కు వేలాడుతూ, నిర్జీవంగా ఆయనను అలా చూసే ధైర్యం నాకులేదు. అందుకే ఆ రోజు నేను నీతో రాలేదు. రానందుకు చాలా రోజులు నన్నో క్రిమినల్‌లా

చూశావు. సున్నితమైన భావాలు లేని మొరటు మనిషినని తేల్చావు.

"పౌర్ణమి ఎప్పుడంటే కాలెండర్ చూసి మాత్రమే చెప్పగలను. ఎవరినైనా మెచ్చు కోవడం నాకు రాదు. అందమైన మాటలు వెంటనే గుర్తుకురావు. పెళ్లయిన కొత్తలో పీరియడ్స్ మిస్సయినాయని, నీకు చెప్పలేదని, అసలు నా ముఖంలో ఉత్సాహం కనబడలేదని చాలా రోజులు విసుక్కుంటూనే ఉన్నావు. కానీ నా లోపల కలల ప్రపంచా లెన్నో తలుపులు తెరుచుకున్నాయని, నేనో రంగులు విరజిమ్మే ఫౌంటెన్‌లా మారిపోయ్యా నని నీకెలా చెప్పను. కృతకంగా, పుస్తకాల్లో లాగా, కొత్త భాషను ఇప్పుడెట్లా నేర్చుకోను?

"తాగి వచ్చినప్పుడు నిన్ను భరించలేక పోయ్యేదాన్ని. నన్ను న్యూరోటిక్ అని తిట్టే వాడివి. నా ముఖం విషాదంగా, దిగులుగా ఏ ఆశా లేనట్లుగా ఉంటుందని ఆరోపిస్తావు. మొరోజ్‌గా ఉన్నానని తిడతావు. మీ అమ్మను, సత్యప్రకాశంను నిర్లక్ష్యం చేశానని, సత్య ప్రకాశం మరణానికి నేనే కారణమని నేరం మోపుతావు.

"మన మూడో పెళ్లిరోజున ఎక్కడికైనా వెళ్దామని; సాగర్‌లో గడిపిన రోజు, నది ఒడ్డున, నీళ్లలో కాళ్లు తడుపుకుంటూ, నువ్వో అందమైన ఘంటసాల పాట పాడి (నిన్న లేని అందమేదో) వద్దన్నా వినకుండా విస్కీ తాగి చీకటిపడ్డాక అక్కడే వెన్నెల, ఆకాశం మనల్నే చూస్తుండగా, ఆ రాత్రి అక్కడే గడుపుదామని ప్రపోజ్ చేశావు. గెస్ట్‌హౌస్‌కు లాక్కువచ్చి గది తలుపులన్నీ వేసి 'సెక్స్‌నెలా ఎంజాయ్ చెయ్యాలో తెలియనిదానివి' అని స్కూలు మాష్టారిలా విసుక్కున్నావు.

"పెళ్లయిన రెండో సంవత్సరంలోనే పాపాయి మన ఇంటికి వచ్చింది. మా అక్క పేరు 'వీరలక్ష్మి' అని దానికి పేరు పెట్టుకుంటే, ఎంతగా విసిగించారు? దానికి 'మోహిని' అని పేరు పెట్టమని ఎంతో పోట్లాడేరు. (ఈ మోహిని ఎవరో ఇప్పటికీ నాకు చెప్పలేదు.)

"వీర రాత్రులు నిద్రపోదు. దాని కోసం రాత్రంతా మేలుకునే దాన్ని. మిమ్మల్ని ఎత్తుకోమంటే దాన్ని పట్టుకుంటే చేతులు వణుకుతాయని, కింద పడేస్తానేమోనని చెప్పి పక్కగదిలో నిద్రపోయేవాడివి. ప్రతిక్షణం ఎత్తుకోమని దాని డిమాండ్. రోజంతా ఏడుస్తూనే ఉండేది. సమస్తం విధ్వంసం చెయ్యడం దానికిష్టం. ఆ సంవత్సరం నిద్ర అనేది మర్చి పోయాను.

"మనం చిట్‌ఫండ్‌లో డబ్బులు దాయడం మొదలుపెట్టాం. కొన్నాళ్లపాటు కండోమ్‌లు వాడుకోవాలని నిర్ణయించుకున్నాం. మీ శరీరంలో త్వరగా మార్పులు వచ్చాయి. నెరిసిన జుట్టు, ముడతలు పడ్డ ముఖం, ముందుకు పొడుచుకు వచ్చిన పొట్ట, జిమ్‌కు వెళ్లడం మొదలుపెట్టావు నువ్వు. అద్దం చూసుకోవడం మానివేశావు. పడకగదిని ద్వేషిం చడం మొదలుపెట్టావు.

"వీర కుర్చీలను, గోడలను పట్టుకొని నిలబడడానికి ప్రయత్నిస్తుంది. వీర నిద్ర

పోయే సమయంకోసం ఎదురుచూస్తుంటాను నేను. తీరా అది నిద్రపోయే సమయానికి నువ్వు గాఢనిద్రలో ఉంటావు. 'మనసున మల్లెల మాలలూగెనే' అంటూ నువ్విప్పుడు పాడడం లేదు. ఆదివారాలు ఒక్కడివే సినిమాలకు వెళుతున్నావు.

"చూస్తుండగానే వీర పెద్దయింది. మాట్లాడడం, బడికి వెళ్లడం, దాని చదువు భారం నాపైనే పడింది. హోంవర్కు అంతా నేనే చెయ్యాలి. వీర స్కూల్ ఫైనల్ పాసయింది. ఇంటర్ కూడా. డిగ్రీలో ఉండగా నా ఆరోగ్యం బాగాలేదనే సాకుతో దానికి పెళ్లి చేశారు. వీర అనే అందమైన కల ఇంటిలోంచి వెళ్లిపోయింది.

"పెళ్లయి ఇరవై రెండేళ్లయింది. మనం ఇప్పుడు ఎక్కువ సమయాల్ని విడివిడిగా గడుపుతున్నాము. పేపరు చదువుకుంటూ మీరు, ఇంట్లో ఆ వస్తువు ఇటూ, ఈ వస్తువును అటూ సర్దుతూ నేను. సంవత్సర క్రితం మీ అమ్మ చనిపోయింది. ఆర్నెల్లు క్రితం మా నాన్న. మా అమ్మ ఇప్పుడు అక్క దగ్గరే ఉంది. వాళ్లు నాతో మాట్లాడడం లేదు.

"ఎందుకో మీరెప్పుడూ నిన్నటి పేపర్నే చదువుతుంటారు. బాగా లావయ్యి, శరీరం భరింపలేని బరువుగా మారిందని దిగులు పడుతున్నాను నేను. పారడైజ్ బిరియాని రుచి తగ్గిందని మీరు రోజూ గొణుగుతున్నారు. ఎందుకో ఎవరైనా హృదయపూర్వకంగా, పెద్దగా నవ్వితే నేను తట్టుకోలేకపోతున్నాను. మీరీ మధ్య జుట్టుకు డై వెయ్యడం మానివేశారు. పౌరహక్కుల గురించి, హక్కుల ఉల్లంఘన గురించి మాట్లాడటం, ఒక హాబీ అయ్యింది, నాకు ప్రీ కాన్సర్ అంటూ డయోగ్నసిస్ చేసిన హాస్పిటల్పై ఎన్నో అనుమానాలు నీకు. 'హిందూ'లో లెటర్స్ టు ఎడిటర్కు రాస్తున్నావు తరచుగా.

"మనం బాగానే ఉన్నాం. అన్ రొమాంటిక్ అని నువ్వు నన్ను తిట్టడంలేదు. ఇప్పుడు ఘంటసాల పాటలు వినడం లేదు నేను. మునుపటిలా ఆనందంగా లేను. ఊరికూరికే కళ్లలో నీళ్లు తిరుగుతున్నాయి. నిన్న రాత్రి నువ్వు నన్ను దగ్గరికి తీసుకుంటే ఎందుకో చాలా దుఃఖం వేసింది.

"ఆలోచించగా ఆలోచించగా, జీవితం అంత దుర్భరంగా లేదనిపిస్తుంది. ఇన్నాళ్లు కలసి ఉండడమే ఆశ్చర్యంగా ఉంది. చాలా సంవత్సరాలు వెనక్కు వెళ్లి, అప్పటి ముచ్చట్లన్నీ నీకు చెప్పాలనిపిస్తుంది. ఇన్నేళ్లు, గడిచాక, ఇప్పుడు ఎందుకో ఇంతదూరం ఇంత త్వరగా నడిచామా అనిపిస్తుంది. మనం విడివిడిగా కలవని అరచేతి పైని గీతల్లా, ప్రేమ అనేది ఏదో మన మధ్యన ఇంకా పుట్టనట్లుగా, కొత్తగా ప్రేమను అర్థం చేసుకోవాలని కోరికగా ఉంది. ఎందుకో, చాలా దిగులుగా ఉంది. -పూర్ణ

ఏడెనిమిది భాగాలుగా ఉన్న ఉత్తరాన్ని వరుసలో పెట్టి, మడిచి బ్యాగ్లో పెట్టుకుంది పూర్ణ. లేచి బయలుదేరబోతున్నంతలో 'పూర్ణా, పూర్ణా' అని రెస్టారెంట్ తలుపు దగ్గర ఎవరో పిలిచారు. ఎవరో పెద్దావిడ. ఆకుపచ్చటి ఖాదీ చీర కట్టుకుంది. జుట్టు

కాస్త నెరసి ఉంది. పూర్ణ ఉన్న టేబుల్ దగ్గరికి వచ్చింది. వస్తూనే పూర్ణను రెండు చేతులతో కౌగిలించుకుంది. పూర్ణ ఆశ్చర్యంగా చూస్తుంది. "పూర్ణా ఎన్నేళ్లయిందే నిన్ను చూసి?" అంది ఆప్యాయంగా. పూర్ణకు ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చుంది. "కూర్చో... కూర్చో" అంటూ పూర్ణను కూడా కూర్చోపెట్టింది.

కుర్చీలో కూర్చుంటూ, ఆమెవైపు సాలోచనగా చూస్తూ, ఒక్కసారిగా ఉలిక్కిపడింది పూర్ణ. ఆమె పూర్ణలాగే ఉంది. పూర్ణకు జిరాక్స్‌లాగా. పూర్ణకు ఆశ్చర్యంగా ఉంది. కలలోలాగా ఉంది. ఆమె పూర్ణ ఆశ్చర్యాన్ని పట్టించుకోనట్టుగా "బ్యూటీ క్లినిక్ ఇంకా నడుపుతున్నావా? మూసేశావా? పెయింటింగ్స్ ఇంకా వేస్తున్నావా?" పూర్ణ ఏం మాట్లాడలేదు. బెరుకుగా చూసింది. ఎదురుగా ఉన్న మనిషివైపు పరిశీలనగా చూసింది. పూర్ణకదో అద్భుతంలా ఉంది. తనలాంటి మనిషే మరొకరు. తన గురించి అన్నీ తెలిసినట్లు.

"మీరు.." అంది ఆమెవైపు చూస్తూ. "నేను మాణిక్యాన్ని. కాన్సర్ పేషెంట్ల కోసం వలంటర్ ఆర్గనైజేషన్ నడుపుతున్నాను. హెల్ప్‌లైన్ ఒకటుంది మాకు" అంటూ పూర్ణవైపు తీక్షణంగా చూస్తూ "ఎలా మర్చిపోయావు నన్ను" అడిగింది.

వెయిటర్‌ను పిలిచి రెండు గులాబ్‌జాం ఆర్డర్ చేసింది. "గులాబ్ జాం నీకు ఇష్టమైన స్వీట్ కదా?" అంది నవ్వుతూ. "ఇవ్వాళ నువ్వు చాలా అందంగా ఉన్నావు. గ్రేస్‌ఫుల్‌గా ఉన్నావు," అంది, పూర్ణ ఏమీ మాట్లాడలేదు. ఆశ్చర్యంగా ఆమెవైపే చూస్తుంది. వెయిటర్ గులాబ్‌జాం తెచ్చాడు. గులాబ్‌జాం చాలా బాగుంది. ఆ రుచి ఎప్పటివో మధురమైన జ్ఞాపకాల్ని వెలికి తీస్తుంది. ఆమె ఇంకో గులాబ్‌జాం ఆర్డర్ చేసింది. రెండోసారి తెచ్చిన గులాబ్‌జాం తింటూ, ఆమె కొద్దిగా గంభీరమైన స్వరంతో "సత్యప్రకాశం సూసైడ్ ఇన్సిడెంట్ నిన్ను బాగా హర్ట్ చేసింది కదూ! ఈ మొగుళ్ళు మూర్ఖులు. రుడాలీలోలా కుటుంబంలోని ప్రతి మరణానికి మనల్ని ఏడమనడం ఏమిటి? ఎ టెర్రిబుల్ టిరనీ," అంది.

వెయిటర్ మూడోసారి గులాబ్‌జాం తెచ్చాడు. ఆమె నిరంతరంగా మాట్లాడుతోంది. అన్నీ తెలిసిన సంఘటనలే ఎప్పటివో సంవత్సరాలను తవ్వితీసినట్లు, పూర్ణ గురించిన సమస్తమూ ఆమెకు తెలిసినట్లుగా వుంది. ఆమె పూర్ణ బయోగ్రాఫర్‌లా పూర్ణ గురించిన విషయాలన్నీ అథారిటీతో చెబుతూంది.

కాసేపటికి పూర్ణ ధైర్యంచేసి, "మీరెవరు? ఎక్కడ ఉంటున్నారు? నేను మీకెలా తెలుసు?" అడిగింది. ఆమె పట్టించుకోనట్లుగా "పెళ్లి కాకముందు నువ్వో ఫెర్‌ఫ్యూమ్ వాడేదానివి గుర్తుందా? మత్తెక్కించే వాసన. కొత్తపేట మార్కెట్ వెనుక ఒక ఆడమనిషి మూలికలు, తైలాలు అమ్మేది. ఆవిడ దగ్గర కొన్నావు. ఆ పెర్‌ఫ్యూమ్ పూసుకొని నువ్వు రోడ్డుపై నడుస్తుంటే వందల కళ్లు నిన్ను చూసేవి. పెళ్లయినాక, ఆ ముసల్ది నీకో వశీ

కరణ తైలం ఇస్తానంది కదూ! నువ్వు పెద్దగా నవ్వేసి, నా నవ్వు చాలదా అన్నావు కదూ!" అంది. ఆమె అట్లా పూర్ణ గురించి ఎన్నో సంగతులు చెబుతోంది. పూర్ణకింకా ఆశ్చర్యంగానే ఉంది. అంతా కనికట్టులా ఉంది. తను మర్చిపోయిన సంగతులు కూడా ఆమె చెబుతోంది.

హఠాత్తుగా ఆవిడ ముఖంలో సీరియస్‌నెస్. "ఐ లెఫ్ట్ మై హజ్‌బెండ్. నా కుడి బ్రెస్ట్‌లో ఒక నోడ్, వీపుపై మోల్- కాన్సర్ ఎర్లీ స్టేజ్ కాబట్టి బ్రతికిపోయాను. మిస్టర్ మొగుడికి చెప్పాను. పాతికేళ్లు నీకు సేవలు చేశాను. ఇంక నన్ను వదిలెయ్యి అని."

ఆ తరువాత, చాలాసేపు వాళ్లు మాట్లాడుకోలేదు. ఆమె చెప్పవలసిన కబుర్లన్నీ అయిపోయినట్లుగా, ఖాళీ చూపులు చూస్తోంది.

వెయిటర్ బిల్లు తెచ్చాడు. ఆమె పర్సులోంచి డబ్బు తీయబోయింది. పూర్ణ వారించి "నో... నో... ఇవాళ నా బర్త్‌డే, బిల్లు నేనిస్తాను," అంది.

"ఓ.." అంటూ ముందుకు వంగి పూర్ణ చెంపలపై ముద్దు పెట్టుకొని, "హ్యాపీ బర్త్‌డే పూర్ణా," అంది. తన బ్యాగ్‌లోంచి గులాబీ పూవు తీసి ఇచ్చింది. 'ఎస్. ఇదంతా కనికట్టే, క్షణాల్లో ఈ గులాబీ...' మనసులో అనుకుంది పూర్ణ.

హోటల్ నుంచి బయటికి వచ్చాక "రా, నా కారులో వదిలి పెడతాను," అంది ఆమె.

పూర్ణ కంగారుగా, "లేదు..నేను వెళతాను," అంటూ ముందుకు నడిచింది.

ఆమె వెనుక నుంచి "పూర్ణా! వై డోంట్ యు జాయిన్ విత్ మి. ఇక ఆ సుందరాన్ని వదిలేయకూడదూ!" అని అరిచింది. పూర్ణ గుండెలు భయంతో కొట్టుకొన్నాయి.

"పోనీ డబుల్ రోల్ సినిమాలోలాగా మనిద్దరం ప్లేసెస్ మార్చుకుందామా?" పెద్దగా అరిచింది.

వినిపించుకోనట్లుగా చకచకా ముందుకు నడిచింది పూర్ణ.

*నవ్య వీక్లీ, 25 ఆగస్టు 2010*